
(కథ)

# జ్ఞానోదయం

-పి. శ్రీదేవి



**మా**ధవరావు మనసంతా అల్లకల్లోలంగా వున్నది. అందుకు కారణం తల్లి సూర్యకాంతమ్మ నుండి వచ్చిన ఫోన్ కాల్. మాధవరావు తణుకులో మున్సిపల్ హైస్కూల్‌లో టీచరుగా పని చేస్తున్నాడు. అతని భార్య ఒక స్టేట్ గవర్నమెంట్ ఆఫీసులో పని చేస్తున్నది. ఇద్దరు పిల్లలు వారికి ఇద్దరూ హైస్కూల్ స్టడీస్ లోనే వున్నారు. మాధవరావుకు ఇంకా ఇద్దరు స్వంత అన్నదమ్ములు, ఇద్దరు సవతి అక్కలు వున్నారు. అతని తల్లి సూర్యకాంతమ్మ భర్త చనిపోయాక దగ్గరలోనే వున్న ఒక పల్లెటూర్లో స్వంతయింట్లో బ్యాంక్ లోవున్న డిపాజిట్లపై వచ్చే వడ్డీతో కాలక్షేపం చేస్తుంది.

సూర్యకాంతమ్మ సినిమాల్లో సూర్యకాంతంలాగా గయ్యాళి స్వభావం కలది. చదువు సంధ్యలు లేకపోవటం, పల్లెటూర్లో రైతు కుటుంబంలో పుట్టి పెరగటం వల్ల అక్కడి వాతావరణ ప్రభావం వల్ల ఆమె ఆలోచనలు సంకుచితంగా వుండేవి.సవతి పిల్లలు యిద్దరూ ఆడపిల్లలు కావటంతో పెళ్ళిళ్ళు అయ్యేంతవరకు వాళ్ళకు సవతి తల్లి పెట్టే ఆరళ్ళుపడక తప్పలేదు. వాళ్ళకు పెళ్ళిళ్ళు జరిగి అత్తవారిళ్ళకు వెళ్ళేసరికి స్వంత పిల్లలు కొంచెం పెద్దవాళ్ళయ్యారు. ఇంట్లో సూర్యకాంతమ్మదే పెత్తనం కావటంతో భర్త కూడా ఆమె గయ్యాళి స్వభావానికి జడిసి ఆమె మాట జవదాటే వాడు కాదు. సూర్యకాంతమ్మ ఎంత సేపూ బంగారం ఎలా కొనాలా అని, డబ్బు ఎలా మూటకట్టాలా అని ఆలోచించేది తప్ప పిల్లలకు మంచి చదువు సంధ్యలు ఎలా చెప్పించాలి ? ఎలా వాళ్ళను వృద్ధిలోకి తీసుకురావాలనే ఆలోచన వుండేది కాదు. ఆమె ఒక్కగానొక్క తమ్ముడు చదువుకుని ఉద్యోగం చేస్తూ పెళ్ళిచేసుకున్నాక తల్లి దండ్రులను పట్టించు కోవటం మానేశాడు. చదువు వల్లే అతను అలా తయారయ్యాడనేది ఆమె మూఢనమ్మకం. అందుకని కొడుకులను ముగ్గురినీ చదువు మాన్పించి తమతో ఆపల్లెటూళ్ళోనే వుంచెయ్యాలని ఆమె పట్టుదల.

పెద్దకొడుకుకు చదువు పెద్దగా అబ్బక పోవటంతో తల్లి కోరికమేరకు పొలం పనులు చూసుకుంటూ ఆ పల్లెటూర్లోనే వుండిపోయాడు. మాధవరావుకు చదువు మీదవుండే ఆసక్తి వల్ల

పట్టుదలగా చదువు పూర్తిచేశాడు. గతం ఎంత బాధాకరంగా గడిచిందో తలుచుకుంటుంటే మాధవరావు కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. అందరికీ బాల్యం మధురస్మృతులను మిగిల్చితే తనకు మాత్రం చేదు జ్ఞాపకాలనే మిగిల్చింది.తన అభివృద్ధికి సహకరించాల్సిన తల్లి అడుగడుగునా తన చదువుకు ఆటంకం కలిగిస్తూండేది. ఏనాడూ తన కష్ట సుఖాలను గురించి పట్టించుకోలేదు. ఒకే వూళ్ళో వున్నా తమ మధ్య సత్సంబంధాలను లేకుండా చేసింది అటువంటి తల్లి ఇపుడు తనకు ఆరోగ్యం సరిగ్గాలేదని తనదగ్గిరకు వస్తానని, హాస్పిటల్‌లో చూపించమని ఫోన్ చేసింది.

మాధవరావు ఆమె మాటలకు క్లుప్తంగా జవాబు చెప్పి స్కూల్ అయిపోగానే యింటికొచ్చాడు. తలుపు తీసి భార్య యిచ్చిన మంచినీళ్ళు త్రాగి కుర్చీలో కూర్చుంటూ " మా అమ్మకు ఆరోగ్యం బాగాలేదట. యిక్కడికి వస్తుందట హాస్పటల్‌లో చూపించమని అడిగింది" అన్నాడు భార్య విజయతో భర్త మాటలు విన్న విజయు మొహం అప్రసన్నంగా మారిపోయింది " ఎందుకుట ? ఆవిడకు మనం పనికిరాముకదా!" అంది చిరాగ్గామొహం పెట్టి." ఏంటా మాటలు ? ఎంతైనా కన్నతల్లి కదా ! నువ్వే చెప్తుంటావు కదా చూడాలని" అన్నాడు భార్యను అనునయిస్తున్నట్లుగా. " అవుననుకోండి. ఆవిడ ఎపుడు రమ్మన్నా రారు కదా !" అంది ఆమె. " పోనీ ఇపుడొస్తోందికదా ! ఆవిడ ఇదివరకు ఎలాగైనా వుండనీ మనం కూడా ఆవిడలా ప్రవర్తిస్తే ఆవిడకు మనకు తేడా ఏమిటి ? అన్నాడు మాధవరావు. విజయ ఇంకేమీ మాట్లాడకుండా ఏదో పనున్నట్లు అక్కడినుండి వెళ్ళిపోయి వంటటైము కావటంతో వంట మొదలు పెట్టింది.

వంట చేస్తున్నదే కానీ విజయమనసు పెళ్ళి అయిన దగ్గరనుండి అత్తగారు తనను భర్తను చూసిన తీరుగురించే ఆలోచిస్తున్నది. ఆవిడ కన్నకొడుకును కూడా ఏనాడూ ఆదరించి భోజనం పెట్టలేదు. తనుపుట్టింటికి వెడితే భర్త వంట చేసుకుని తినేవాడు. తన కన్నపిల్లలను కూడా మనవలనే మమకారంతో ఏనాడూ చేరదియ్యలేదు. భర్త, తను యిద్దరూ జాబ్ చేసుకుని పిల్లలను చూసుకుని అవస్థ పడేవారు. మామగారు వున్నంత కాలం ఆయనను కూడా పిల్లలను పలకరించి చేరదీయనిచ్చేది కాదు. అసలు అటువంటి మనిషిని ఎందుకు చూడాలి ? లోకం కోసం, భర్తను కన్నతల్లి అని తప్ప అనుకుంది విజయ.

మర్నాడు ఉదయం భర్తను, పిల్లలను స్కూలుకు పంపించి తాను ఆఫీసుకు సెలవుపెట్టి పని చేసుకుంటుంటే అత్తగారు సూర్యకాంతమ్మ రిక్షా దిగింది స్థూలకాయాన్ని మోస్తూ. విజయ మనసులో విసుక్కున్నాగానీ పైకి మర్యాదగానే ఆహ్వానించి మంచినీళ్ళు, కాఫీ త్రాగటం అయ్యాక " ఎలా వుంటోందండీ ఒంట్లో"! అడిగింది తప్ప దన్నట్లుగా. " ఏం బాగోటం లేదమ్మాయ్" ఏదో నాల్రోజులుండి హాస్పిటల్‌లో చూపించు కుందామని ఒచ్చాను" అంది ఆయాసపడుతూ. " వాడు, పిల్లలు స్కూలుకెళ్ళారా"? అడిగింది. " అవును ఇప్పటి వరకు చూసి యిపుడే వెళ్ళారు" అనిఆవిడకు భోజనం పెట్టి పెరట్లో బట్టలు తీయడానికి వెళ్ళింది.

సూర్యకాంతమ్మ ఇంతకాలం చిన్నకొడుకుకు దూరంగా వుండి అతనిని ఆదరించక పోయినా గానీ అతనిదగ్గరకు వచ్చి వైద్యం చేయించుకోవాలని అనుకోవటానికి కారణం మిగిలిన ఇద్దరి కొడుకులు, వారి భార్యల ప్రవర్తనే పెద్దకొడుకుకు, అతని భార్యకు తమ్ముడు చదువుకొని ఉద్యోగస్థుడు కావడం, అతనికి ఉద్యోగస్తురాలు భార్యగా రావటం, కంటగింపు కలి

**మాక్స్ ముల్లర్**

12 డిశంబర్ 1823న ఫ్రెడరిక్ మాక్స్ ముల్లర్ జర్మనీలో జన్మించారు. వీరి తండ్రి విల్‌హెల్మ్ ముల్లర్ ప్రసిద్ధుడైన జర్మన్‌కవి. ప్రొఫెసర్ బోకన్ వద్ద శాకుంతలం, రుగ్వేదం మొదలైన సంస్కృత గ్రంధాలను అధ్యయనం చేశాడు. హితోపదేశాన్ని జర్మనీ భాషలోకి అనువదించారు. 'సీక్రెడ్ బుక్స్‌ఆఫ్‌ది ఈస్ట్' అనే గ్రంథంలో భారతీయ దర్శనాల విశిష్టతను వివరించారు. 'ఇండియా - వాట్ ఇట్ కెన్ టీచ్ అజ్' అనే ప్రాచీన సంస్కృత వాఙ్మయ చరిత్రమొదలైనవి

గించింది తాము ఈ మట్టి పనులు చూసుకుంటూ, ఈ వల్లెటూళ్ళోనే పడివుండి ఎల్లకాలం తల్లిని తావే చూడాలా ! అని అనుకున్నాడు అతను, అతని భార్య దానికి తోడు తోటికోడలిని చూసి ఈర్ష్యపడే అతని భార్య అత్తగారి మాటను లెక్క చేసేది కాదు ఇక మూడో కొడుకు, కోడలి పద్ధతి కూడా ఇంచుమించు ఈరకం గానే వుండేది. అంతే తప్ప రెండో కొడుకు ఉద్యోగస్తుడు కావటానికి అతను ఎన్నిపాట్లు పడ్డాడో. తల్లి అతని చదువు కొనసాగకుండా ఎన్నిరకాలుగా ఆటంక పరిచేదో, ఎన్ని హింసలు పెట్టేదో కళ్ళారా చిన్నతనం నుండీ చూసిన వారు అవన్నీ మర్చిపోయారు.

తల్లి అనారోగ్యంతో వున్నాగానీ ఇద్దరు కొడుకులూ, కోడళ్ళూ పట్టించుకోవటం మానేశారు. సూర్యకాంతమ్మకు చిన్న కొడుకు మాధవరావు అతని భార్య విజయ గుర్తొచ్చారు. తాను అష్టకష్టాలపాలు చేసిన చిన్న కొడుకు ఈనాడు ప్రయోజకుడై పట్నంలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతను వీళ్ళలా దుడుకు స్వభావం కలవాడు కాదు. సౌమ్యుడు కోడలు విజయ చదువుకున్న పిల్ల అయినాగానీ మర్యాద తెలిసినది. ఈ పరిస్థితుల్లో వాళ్ళే తనకు దిక్కు. వాళ్ళ గుమ్మంలోకి వెళ్తే వాళ్ళు తనను ఆదరిస్తారనే నమ్మకం వుంది ఆమెకు.

చిన్నతనం నుండీ తాను మూర్ఖత్వంతో చిన్నకొడుకును చదువు కోనివ్వకుండా చెయ్యడం. అతని పుస్తకాలు వర్షంలో గిరాటెయ్యడం అన్నీ గుర్తొస్తున్నాయి" చదువు మీద యిష్టంతో కూలిపని చేసుకుని సంపాదించిన డబ్బులు కూడా లాక్కొనేది ఆనాడు తాను చేసిన పనులు గుర్తొచ్చి సిగ్గుతో, పశ్చాత్తాపంతో కుమిలిపోతూ తాను ఆనాడు ప్రవర్తించిన ప్రవర్తనకు శిక్షగా వాళ్ళు ఏమన్నా పడాలనే ఉద్దేశ్యంతోనే మాధవరావు దగ్గరకు

**హ్యూమన్‌రైట్స్‌డే**

యు.యన్.ఓ. 10 డిశంబర్ 1948న మానవ హక్కుల ప్రకటన వెలవరించింది. ఈ ప్రకటనను రూపొందించడంలో నోబెల్ శాంతి బహుమతి విజేత అయిన రీన్‌కాసిన్ ప్రధాన పాత్ర పోషించాడు. ఐక్యరాజ్య సమితి మానవహక్కుల కమీషన్ ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల అమలుతీరును పర్యవేక్షిస్తుంది.

బయల్దేరింది.

గతంలో తన ప్రవర్తనను గురించి నెమరు వేసుకుంటున్న సూర్యకాంతమ్మ సాయంత్రం మాధవరావు స్కూల్ నుండి వచ్చి తల్లిని ముక్తసరిగానే పలకరించటంతో బాధపడినా గానీ గతానికి శిక్ష అనుకుంది. మనవలిద్దరూ తనను పలకరించటంతో తేరుకుని వాళ్ళకు సమాధానం చెప్పింది మాధవరావు పిల్లలతో టి.వి చూస్తూ వాళ్ళకు అర్థం కానివి చెప్తూ భార్య విజయను మార్కెట్‌లో ఏం కావాలో కనుక్కున్నాడు.

" బజారుకు వెళ్ళి వచ్చాక నిన్ను హాస్పిటల్‌కు తీసికెళ్తాను" అన్నాడు తల్లితో " ఈ రోజుకు ఎక్కడికీ రాలేనురా ఆయాసంగా వుంది. రేపు తీసికెల్దువుగాని అంది ఆమె. " సరే నీయిష్టం నేను అలా వెళ్ళొస్తాను" అని చెప్పి బయటకు వెళ్ళిపోయాడు మాధవరావు.

పిల్లలిద్దరూ హోమ్‌వర్క్ పూర్తిచేసి నాన్నమ్మ దగ్గరకు వచ్చి కబుర్లు చెప్తుంటే సూర్యకాంతమ్మకు విపరీతమైన దగ్గు వచ్చింది. మాధవరావు కూతురు భార్గవి " దగ్గు బాగా వస్తోందా నాన్నమ్మా ! అని గుండెలు రాస్తూ "సిరప్ యివ్వనా?" అంది అమాయకంగా.

మాధవరావు కొడుకు రాజు " మంచినీళ్ళు తీసుకురానా నానమ్మా ! అంటూ కిచెన్‌లోకి పరిగెత్తుకెళ్ళి మంచినీళ్ళు తెచ్చి త్రాగించాడు. పిల్లలిద్దరూ తనమీద చూపిస్తున్న శ్రద్ధకు, ప్రేమకు సూర్యకాంతమ్మ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. తాను మనవలని ఏనాడూ ప్రేమతో చేరదియ్యలేదు. చిన్నతనంలో కూడా ముద్దుగా చూడలేదు. కొడుకు పట్ల అతని చదువు పట్ల ఎపుడూ చిన్న చూపే చూసింది. అయినా వాళ్ళెంత ప్రేమ చూపిస్తున్నారు? అనుకుంది.

మాధవరావు పిల్లలకు ముందుగానే " నాన్నమ్మ మనయింటికి వస్తుంది. ఆమెకు ఆరోగ్యం బాగోలేదు

ఏమైనా కావాలంటే చూడండి " అని చెప్పటం వల్ల పిల్లలు నానమ్మకు సపర్యలు చేస్తున్నారు.

ఇంతలో చినుకులుగా పడుతున్న వర్షం పెద్దది కావటంతో మాధవరావు తడుస్తూనే వెనక్కి వచ్చేసి బైండింగ్ చేయించాలని తీసుకెళ్ళిన పుస్తకాలను తడిసిపోవటంతో ఆరబెడుతూ హోరున కురుస్తున్న వానను చూస్తూ అలాగే నిలబడ్డాడు. హోరున కురిసే వానను అతను జీవితంలో ఎపుడూ మర్చిపోలేడు. గతం అతని కళ్ళముందు కదలాడింది. స్కూలుకు వెళ్ళివచ్చి పరీక్షలు దగ్గర పడుతున్నాయనీ,చదువు కుందామని పుస్తకం తెరిచిన మాధవరావు భద్రకాళిలా తన ముందు నిలచిన తల్లిని తెల్లబోతూ చూశాడు. అతని చేతిలోని పుస్తకాన్ని ప్రక్క నున్న వాటితో సహా ఏకధాటిగా కురుస్తున్న వానలోకి విసిరేసింది. ఆమె.

తల్లి ఎందుకలా ప్రవర్తిస్తున్నదో అతనికి అర్ధం కాలేదు మేనమామ తల్లి దండ్రులను పట్టించుకోలేదని చదువుకుని చెడిపోయాడని తల్లి అంటుంటే అతనికి ఏం మాట్లాడాలో తెలియలేదు. సూర్యకాంతమ్మ లోపలికి వెళ్ళగానే అతను భయం భయంగా వానలో తడుస్తూ వెళ్ళి తడిసి ముద్దవుతున్న పుస్తకాలను తెచ్చి ఆరబెట్టుకుని చదువు కున్నాడు. అన్నగారు చదువు అబ్బక వ్యవసాయ పనులు చూసుకుంటుంటే తమ్ముడు మెకానిక్ షాపులో పనిచేస్తుంటే ఆర్ధికంగా ఏలోటూలేని మాధవరావు కేవలం తల్లి మూర్ఖత్వం, పట్టుదల వల్ల తండ్రికి చదివించాలని వున్నా తల్లి ఫీజులు కట్టనివ్వక పోవటంతో కూలీ నాలీ చేసి కష్టపడి చదివి డిగ్రీ అయ్యాక బి.ఇడి ఎవరి దగ్గరో అప్పుచేసి చదువుకుని టీచర్ పోస్ట్ వచ్చాక ఆ అప్పు తీర్చు కున్నాడు.

సూర్యకాంతమ్మ మూర్ఖత్వానికి, ఆంక్షలకు తాత్కాలికంగా కోపం కలిగినా ఆ కోపం తల్లి మీద ఎపుడూ చూపించలేదు. తిరిగి ఈనాడు తనను ఆనాడు అంతగా ఇబ్బందులు పెట్టిన తల్లి తన దగ్గరకే వచ్చి వుండాలని అనుకుంటోంది. మానవత్వం, చదువుకున్న సంస్కారం, అతని సరళస్వభావం తల్లిని సూటిగా అడగాలని వున్నా గానీ అడగనివ్వటం లేదు. తన కర్తవ్యం కొడుకుగా తాను చెయ్యాలి. అపుడు ఆవిడే తెలుసుకుంటుంది. సవతి పిల్లలను ఎలా హింసలు పెట్టిందో,చదువు విషయంలో తనను అలాగే హింసించింది. ఆశీర్వదించి. అండగా నిలవాల్సిన కన్నతల్లి చదువు విషయంలో సవతి తల్లిలా ప్రవర్తించిందంటే. ఎవరూ నమ్మరు అనుకున్నాడు.

" అదేంట్రా అబ్బాయ్ ! వానపడుతుంటే అలాగే చూస్తూ నిలబడ్డావు చినుకులు మీద పడటం లేదా? అడిగింది ఎపుడు వచ్చిందో వెనకాల నుండి సూర్యకాంతమ్మ.

" ఈవాన చూస్తుంటే నాచిన్నప్పటి సంగతులు నీకు గుర్తురావటం లేదా అమ్మా!" నిర్లిప్తంగా అడిగాడు తల్లిని.

" ఎలా మరిచిపోతానురా ? ఆనాడు నేను డబ్బు పిచ్చితో అన్నయ్యకు, తమ్ముడికి చదువు రాలేదని పనుల్లో పెట్టి చదువొచ్చినా నిన్ను చదువు కోనివ్వకుండా పుస్తకాలు విసిరేశాను. చదువు గురించి నువ్వు కష్ట పడి సంపాదించుకున్న డబ్బులుకూడా లాగేసుకున్నాను. మామయ్య తాతయ్యను, అమ్మమ్మను చూడలేదని చదువుకుంటే మీరూ అలాగే తయారౌతారునుకున్నాను" అంది మొహం చేతుల్లోకి దాచుకుని ఏడుస్తూ.

తల్లిని ఓదార్చాలని పించలేదు అతనికి అలాగే మౌనంగా చూస్తున్నాడు. పిల్లలిద్దరూ వచ్చి" నాన్నమ్మా! అమ్మ భోజనానికి రమ్మంటోంది" అనడంతో అక్కణ్ణించి లేచి లోపలికి నడిచింది.

**మొదటి వితంతు వివాహం**

7 డిశంబర్ 1856న బారతదేశంలో మొదటి వితంతు వివాహం జరిగింది. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కృషి ఫలితంగా 1856లో వితంతు పునర్ వివాహ చట్టం అమలులోకి వచ్చింది. ఈయన తన మిత్రుడైన శిరీష చంద్ర విద్యాలంకార్‌కు కాశీపాత్రదేవి అనే వితంతువుకు వివాహం జరిపించారు.

సూర్యకాంతమ్మకు పెందరాళ్లే భోజనం చేసి మందులు వేసుకోవటం అలవాటు విజయ ఆమెను పిలిచి ముందుగానే భోజనం పెట్టేసింది. భోజనం చేసి లేవబోతున్న సూర్యకాంతమ్మ ఒళ్ళుతూలి ముందుకు పడబోతుంటే అక్కడే వున్న విజయ అప్రయత్నంగానే ఆమెను గబుక్కున పట్టుకుంది. అపుడే వంటింట్లోకి వస్తున్న మాధవరావు, పిల్లలు గబగబా పరిగెత్తుకొచ్చారు ఏమయ్యిందంటూ.

సూర్యకాంతమ్మ మనసులో బాధ ఇంకా ఎక్కువయ్యింది వాళ్ళ ఆత్రుతను చూశాక. ఎందుకర్రా ! మీరు నామీద ప్రేమ చూపిస్తున్నారు ? మీలో ఎవరినీ నేను ఇన్నేళ్ళల్లోనూ ఏనాడూ ఆదరించలేదు. మనవలను ప్రేమగాచూడలేదు కన్న కొడుకునూ నామూర్ఖత్వంతో హింసించాను. ప్రేమ చూపిస్తారనుకున్న వాళ్ళకు నేను పనికి రాకుండా పోయాను. ఇంతకాలం నేను చాలా తప్పుచేశాను నన్ను ఆ దేవుడు క్షమించడు. అంటూ భోరున ఏడుస్తుంటే.

ఏదో మాట్లాడబోతున్న విజయను వారించాడు మాధవరావు. వర్షించిన మేఘం తేలికపడినట్లుగా పశ్చాత్తాపంతో నిండిన సూర్యకాంతమ్మ మనసులోని బాధంతా తీరి అపుడు జ్ఞానోదయం అయినట్లుగా వుండిపోయింది. ★

## నేషనల్ కాంగ్రెస్‌డే

28 డిశంబర్ 1885లో వివిధ ప్రాంతాలనుండి హాజరైన 72మంది ప్రతినిధులు బొంబాయి సమావేశంలో భారతజాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది. దీనికి ఉమేష్‌చంద్ర బెనర్జీ మొదటి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సమన్వయానికి, ప్రభుత్వ యంత్రాంగంలోని లోపాలను బట్టబయలు చేయడానికి ఈ సంస్థ స్థాపించబడింది.

# 'స్వర్గధామం'

భూపాల రాగపు పాటలోని మాధుర్యంతో
నాహృదయం మేలుకుంది.
నీవీ అవనికి అరుదెంచి
నా, యీరాగం వింటావాప్రభూ !

నా హృదయపు బంగారు వాకిలి
తెరచివుంచాను
వీడని అనుబంధపు విన్నపాలు
పశిడి తెరలు పైకెత్తి వింటావాప్రభూ !
నాహృదయ పీఠము పై కరుదెంచు
నీనాట్యముద్రలు,లయలు,నాలో
నడయాడుతున్నాయి
ప్రతిరాగం
వసంత రాగమై
సుందరపుష్పంగా రాజిల్లుతోంది.
ఆనీలి సాగరపుసంగీత మధురిమ
ఝురిలోని
పాటలతో నీ అభయ ముద్రలు.
సుప్రభాతపు ధృవనక్షత్రం వెలుగు
కర్పూర నీరాజనాలర్పిస్తున్నది.
నీ మెత్తని కరస్పర్శతో
నా జీవన నౌకప్రశాంత యానం సాగిస్తున్నది
కానీ
నీచెంత లేని లౌకిక స్పృహ
ఎప్పుడూ వేధిస్తూ నేవుంది.
ఈ జగన్నాటక కానికి తెరదించి
నీ కోసం పరుగెత్తుకువస్తున్నా
నీతో కలసిన క్షణం
నీలో ఐక్యం అయిన క్షణం
ఆ ఒకటే నాకు స్వర్గధామం

ఆంగ్లమూలం : **ఆచార్య సత్య ప్రదానందా**
తెలుగు సేత : **- యు.వి. రత్నం.**